


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### ఎవరిది తెలివి?

**బాల్యం ఎంత** బావుంటుందీ? పెరట్లో మావిడి చెట్టుకింద నవారు మంచం వేసుకుని, పడుకున్న బామ్మ చెప్పే కథలు ఎన్నిసార్లు అయినా అదే కథ. ఒక రాజుగారికి ఏడుగురు కొడుకులు వేటకి వెళ్ళారు. ఏడు చేపలు తెచ్చి ఎండ పెట్టారు. ఒకటి ఎండలేదు.

ఇంకో కథ చీమా చిలుకా నేస్తం కట్టుకున్నాయి. పరవాన్నం వండుకుంటుంటే, వుడికిందో లేదో చీమ తొంగి చూసింది. లోపల పడిపోయింది. చీమ చచ్చిపోయింది. తీద్దామని చూసిన చిలకముక్కు వూడిపోయింది. చిలక గంగ రావిచెట్టు మీద కూర్చుని ఏడుస్తుంటే, చెట్టు అడిగింది. "చిలకమ్మా, చిలకమ్మా ఎందుకేడుస్తున్నావూ?" అని "చీమా చిలుకా నేస్తం కట్టుకున్నాయి. చీమ చచ్చిపోయింది. చిలక ముక్కు వూడిపోయింది. నన్నీ ప్రశ్న అడిగిన గంగ రావిచెట్టు ఆకులన్నీ వూడిపోవాలి" అంది. గంగరావి చెట్టు ఆకులన్నీ రాలిపోయాయి. ఇంతలో ఏనుగొచ్చి "గంగరావి చెట్టూ, గంగరావి చెట్టూ నీ ఆకులేమయ్యాయీ?" అంది. అప్పుడు గంగ రావిచెట్టు "చీమ చచ్చిపోయింది. చిలకముక్కు వూడిపోయింది, గంగరావి చెట్టు ఆకులు రాలిపోయాయి. ఇది అడిగిన ఏనుగు కుంభ స్థలం కూలిపోవాలి" అంది. వెంటనే ఏనుగు కుంభస్థలం కూలిపోయింది. ఏనుగు ఏటికి వెళ్ళింది నీరు తాగడానికి. ఏరు అడిగింది..

"ఏనుగూ ఏనుగూ నీ కుంభస్థలం ఏమయిందీ?" అని. అప్పుడు ఏనుగు "చీమ చచ్చిపోయింది. చిలుకముక్కు వూడిపోయింది. గంగ రావి చెట్టు ఆకులు రాలిపోయాయి. అడిగిన ఏనుగు కుంభ స్థలం కూలిపోయింది. ఇది అడిగిన ఏరు ఎండిపోవాలి" అంది. ఏరు ఎండిపోయింది. అప్పుడే రాజుగారి కోడళ్ళు బిందెలు చంకన పెట్టుకువొచ్చి "ఏరూ ఏరూ ఎందుకు ఎండిపోయావూ? " అన్నారు.

ఏరు వెంటనే "చీమ చచ్చిపోయింది. చిలక ముక్కు వూడిపోయింది. గంగరావి చెట్టు ఆకు రాలిపోయాయి, ఏనుగు కుంభస్థలం కూలిపోయింది. అడిగిన ఏరు ఎండిపోయింది. ఇది అడిగిన మీ చంకలకి బిందెలు అంటుకు పోవాలి" అంది వెంటనే రాజుగారి కోడళ్ళ చంకలకి బిందెలు అంటుకుపోయాయి. వాళ్ళు ఎంత లాగినా పీకినా లాభంలేక ఏడుస్తూ ఇంటికి వచ్చారు. ఆ సమయంలో రాజుగారు భోంచేస్తుంటే, రాణీగారు ఆయనకి పప్పు వడ్డించబోతోంది. తెడ్డుతో, ఆవిడ కోడళ్ళు బిందెలు దింపడం రాక అవస్థపడ్తుంటే నవ్వి "ఏమయిందిరా?" అంది. వాళ్ళు వెంటనే, చీమ చచ్చిపోయింది, చిలక ముక్కు వూడిపోయింది. గంగరావి చెట్టు ఆకులు రాలిపోయాయి. ఏనుగు కుంభస్థలం కూలిపోయింది. ఏరు ఎండిపోయింది. రాజుగారి కోడళ్ళ చంకలకి బిందెలు అంటుకుపోయాయి, ఇది అడిగిన రాణిగారి చేతికి తెడ్డుకు అంటుకుపోవాలి అన్నారు. రాజుగారికి ఆవిడ అంటుకుపోయిన తెడ్డుతో పప్పు వెయ్యబోతే, ఆయన "ఏమయింది చేతికి?" అన్నారు. ఆవిడ వెంటనే "చీమ చచ్చిపోయింది, చిలకముక్కు వూడిపోయింది, గంగరావి చెట్టు ఆకులు రాలిపోయాయి, ఏనుగు

కుంభస్థలం కూలిపోయింది, ఏరు ఎండిపోయింది, రాజుగారి కోడళ్ళకి బిందెలు అతుక్కుపోయాయి. అడిగిన రాణి చేతికి తెడ్డు అంటుకుపోయింది. ఎందుకని అడిగిన రాజుగారి పిర్రకి పీట అంటుకుపోయింది. ఎందుకని అడిగిన రాజుగారి పిర్రకి పీట అంటుకు పోవాలి'' అంది.

అంతే రాజుగారికి పీట అంటుకుపోయింది అలాగే సభకి వెళ్ళారు. అది చూసి సభలో వాళ్ళందరూ నవ్వారు ''ఏమయింది?'' అన్నారు.

''రాజుగారు చీమ చచ్చిపోయింది చిలకముక్కు వూడిపోయింది, గంగరావి చెట్టు ఆకులు రాలిపోయాయి, ఏనుగు కుంబస్థలం కూలిపోయింది, ఏరు ఎండిపోయింది, రాజుగారి కోడళ్ళకి బిందెలు అతుక్కుపోయాయి, రాణిగారి చేతికి తెడ్డు అంటుకుపోయింది. రాజుగారికి పీట అంటుకుపోయింది. ఇది అడిగిన మీ అందరికీ కూర్చున్న చాప అంటుకుపోవాలి'' అన్నారట.

అంతే, చాప వాళ్ళకి అంటుకుపోయిందట. ఒకడు ఇటు లాగుతాడు, ఇంకొకడు అటు లాగుతాడుట. జనం అంతా వాళ్ళని వీధిలో చూసి నవ్వుతున్నారు. ఒక చాకలతను బట్టలమూటని వీపున మోసుకుంటూ వస్తూ, ఇది చూసి ''చదువుకున్న మారాజులూ ఏవైంది?'' అన్నాడుట.

వాళ్ళు వెంటనే ''చీమ చచ్చిపోయింది. చిలక ముక్కు వూడిపోయింది. గంగరావి చెట్టు ఆకులన్నీ రాలిపోయాయి. ఏనుగు కుంభస్థలం కూలిపోయింది. ఏరు ఎండిపోయింది. రాణిగారి కోడళ్ళకి బిందెలు అంటుకుపోయాయి. రాణిగారి చేతికి తెడ్డు అంటుకుపోయింది. రాజుగారి పిర్రకి పీట అంటుకుపోయింది. అడిగిన సభలో వాళ్ళకి చాప అంటుకుపోయింది. ఇప్పుడు నీ వీపుకి'' అనబోతుంటే చాకలతను ఠక్కున మూట కిందపడేసాడుట.

అంతే చీమ బతికొచ్చింది. చిలకకి ముక్కు వచ్చింది. గంగరావిచెట్టుకి ఆకులొచ్చాయి. ఏనుగుకి కుంభస్థలం వచ్చింది. ఏట్లో నీళ్ళు వచ్చాయి. రాజుగారి కోడళ్ళ చంకల నుండి బిందెలూడివచ్చాయి. రాణిగారి చేతినుండి తెడ్డు వూడివచ్చింది. రాజుగారి పీటవూడి వచ్చింది. సభలో వాళ్ళకి చాప వూడి వచ్చింది'' అందుకే చదువుకున్న వాడికన్నా చదువుకోని చాకలాడు మేలు అన్నారు'' అని మా బామ్మ చెప్పేది. నిజమే కదా అనిపిస్తోంది ఇప్పటి పరిస్థితులు చూస్తుంటే.

ప్రతివాడూ WHOఅయిపోయి రకరకాలుగా కరోనా గురించి తీర్మానాలు ఇచ్చేస్తున్నారు. ఒకడు మూడవ తరంగం వచ్చేసింది. పిల్లలకి ప్రమాదం అంటాడు. ఇంకోడు ఇది యుగాంతం అంటాడు. ఒక్కడూ 2019 ఉగాదినాడు నోరిప్పి 2019 నవంబర్ నుండీ మొదలయ్యే ఉపద్రవం గురించి మాట్లాడిన సిద్ధాంతి లేడు. ఇప్పుడు పుట్టుకొచ్చారు.

యూ ట్యూబ్‌ల నిండా జ్యోతిష్య శాస్త్రాన్ని ఔపోసన పట్టిన వృద్ధండులు. రేపు వాన వస్తుందో లేదో చెప్పలేరు. టీవీల్లో ఏ హీరో సినిమాకి ఎంత కలెక్షన్ వస్తుందో చెప్తారు. పిల్లల్ని కూడా ఈ వృత్తిలో దింపే తల్లిదండ్రుల్లా నాలుగు చిలుక పలుకులు నేర్పించి వదుల్తున్నారు.

ఇందాకా ఒక వాట్స్అప్ మెసేజ్ చూసాను. నిజమెంతో కానీ ఆ వాట్సప్ సృష్టికర్తకి తల వంచి నమస్కరిస్తున్నాను. ఇంత మేధ వృధాగా పోతోంది.

1) చైనాలో వున్న బయోలాజికల్ కంపెని జి.ఎస్.కె అంటే గ్లాక్సోస్మిత్‌క్లైన్ అమెరికా వాళ్ళదిట.

2). ఇంక యాధృచ్చికంగా జి.ఎస్.కె వాడే ఫైజర్ కంపెనీ వాడిదేనట.

3) మూడో కాకతాళీయం ఫైజర్ కంపెనీ వాక్సిన్ కనిపెట్టిందట కోవిడ్‌కి. అంటే అది లీక్ చేసిన కరోనా వైరస్‌కి అదే వాక్సిన్ కనిపెట్టిందట.

4). జర్మనీ వాడికి ఓ లేబరెటరీ వుందిట వ్యూహాన్‌లో.

5) ఫైజర్ చాలా లో టెంపరేచర్‌లో పెట్టాల్సిన వాక్సిన్‌ట. అది జర్మనీ కంపెనీ వింటర్ థర్ చేస్తుందట.

6). ఇంక థర్డ్ వేవ్‌లో చిన్నపిల్లలు ఎఫెక్ట్ అవుతున్నారని ప్రోపగాండా మొదలయింది. మళ్ళీ కాకతాళీయంగా లేదా అనుకోకుండా వారంలోనే చిన్న పిల్లలకి మా దగ్గర వాక్సిన్ వుందని ఫైజర్ ఎనౌన్స్ చేసింది. వారంలో ప్రయోగాలు ఎప్పుడు చేసిందో మరి.

7) సో ఈ విధంగా కొన్ని పెద్ద దేశాలు ముందు వైరస్‌నీ, అర్వాత వాక్సిన్ నీ సృష్టించి ప్రపంచం మీదకి వదిలి. WHO మాట్లాడినట్లు వాళ్ళే మాట్లాడి, జనాభాని తగ్గించి, మళ్ళీ తమ వాక్సిన్ మార్కెట్లోకి వదిలి. ప్రజల్ని బతికించినట్లు నటించి, ఈలోగా పెద్ద లాభాలు పొంది ఆర్థికంగా పరిపుష్టం అవుతున్నారుట.

8). ఇంక చివరాఖరిగా జో బైడెన్ మాస్క్ వేసుకొచ్చి, ప్రజల ముందుకి, మాస్క్ తీసేసి, "ఇంక రెండు డోసులూ ఫైజర్ వాక్సిన్ వేసుకున్న వాళ్ళకి మాస్క్‌తో పని లేదన్నాడు. అంటే ఎవరికి ఎడ్వర్‌టైజ్ చేస్తున్నాడూ? ఫైజర్‌కి. ఆ ఫైజర్ ఎవరి ల్యాబ్‌లో సృష్టించబడింది? జి.ఎస్.కె. ఆ జి.ఎస్.కె ఎవరిదీ? అమెరికాది. దట్స్ ఆల్.

మరి ఇంటర్నేషనల్ ప్రయాణాలకి భారత్ బయోటెక్ తయారు చేసిన కోవేక్సిన్ ఎలా ఒప్పుకుంటారూ?


ఇంత వ్యాపారం లేదా మాఫియా వున్నప్పుడు ఒకరెవరో వచ్చి "నేను ఎక్కువ చదువుకోలేదు. కానీ తరతరాలుగా ఆయుర్వేదం, చెట్ల మందులూ తయారు చేస్తాను. 70 వేల మందికి రోగం తగ్గింది. మీరు లాబ్‌లలో చంపిన ఎలకలూ, బయట చంపిన మనుషులు కన్నా ఎక్కువ మందికి ఇచ్చాను. రోగం తగ్గిందో లేదో కానీ ఎవరూ చావలేదు. ఎందుకంటే రాజుగారి సభలో వాళ్ళకి చాప అంటుకుపోయింది అనేలోగానే మాట వదిలేసిన వాడిని నేనే. ఆ కాలంలోనూ అంతే తెలివిగా వున్నాను మిగతా వాళ్ళని నా యుక్తితో శక్తితో 'చాప' అనే రోగం నుండి విముక్తులని చేసాను. అంటే నీ పబ్లిసిటీ ఇన్‌చార్జ్ ఎవరూ? మార్కెటింగ్ హెడ్ ఎక్కడ? కేపిటల్ ఎక్కడనుండి వస్తోంది? మా వాక్సిన్, మెడిసిన్ తయ్యారయ్యాలోగానే నువ్వు ఇలా 'ఫ్రీగా' వేర్లూ, పైర్లూ పీకి మందులు చేసి ఇచ్చేస్తావా? అదీ భారతీయ ప్రాచీన సంస్కృతి అంటూ ఇంక ఈ వ్యూహాలూ.. లాబ్‌లూ వాక్సిన్‌లూ.. మెడిసిన్‌లూ మట్టిగొట్టుకు పోవాలా? మాఫియా తెలుసా? తెలీదు.. చిన్న 'పట్నం' అనబడే వూరి వాడివా? అయితే చూపిస్తాం. అన్నారు.

సరే! ఈ గొడవంతా ఫేస్ బుక్ గోడల మీద చూసి తెలుసుకున్నదే నేను. కానీ ఒక మాట. నేను అల్లోపతినీ ఆయుర్వేదాన్నీ, హోమియోనీ యునానీ నీ ఏవీ అనను. కనీసం ఈ సద్గురువులు ఇచ్చే విభూతిని కూడా తప్పు పట్టను. యూట్యూబ్ ఎంప్లాయిమెంట్ వల్ల డబ్బు సంపాదించే, వంటింటి వైద్యంతో కషాయంతో కరోనాని తరిమి కొడదాం అనే వాళ్ళనీ ఏమీ తప్పు పట్టను కానీ.. ఇంత అరెస్టుల వరకూ వెళ్ళేకన్నా జనానికి టోకెన్లూ ఇచ్చి క్యూలో సోషల్ డిస్టెన్సింగ్ మెయిన్‌టెయిన్ చేసేట్లు ఏర్పాటు చేసి నమ్మకం వున్న వాళ్ళని కరోనా మందు తీసుకోనివ్వచ్చుగా. మన చిన్నప్పుడు నేల వుసిరి పేరుతో పచ్చ కామెర్ల మందు ఇస్తే తీసుకోలేదూ? ప్రాక్చర్లు అయితే నూనె మర్దనా, పసరు పూతలకి పుత్తూరు వెళ్ళి కట్లు కట్టించుకునే వాళ్ళు లేరూ? ఇప్పటికీ చక్కెర వ్యాధి అనేది లేనే లేదు. గోమూత్రం, ఆవు పేడతో తగ్గిస్తాం అనే వైద్యులు తెలుసు. వీళ్ళందరినీ ప్రభుత్వం ఏమీ ఆపలేదుగా. ఇది మాత్రం ఎందుకు ఆపాలి? ఎవరైనా కంప్లైంట్ చేసారా? లేదా ఎవరినైనా నియమించి మందు మింగిన వాళ్ళని చంపిస్తే తప్పు.. పనిచెయ్యకపోవచ్చు కరోనాకి. కానీ మనుషులని చంపకపోవచ్చు. ఎవడి నమ్మకానికి వాడ్ని పోనివ్వండి. ఇక్కడ అల్లోపతి వైద్యానికి వున్న ఆస్తులన్నీ అమ్ముకున్నాక వాడు పోతే అతనికి చాలా రోగాలున్నాయి. అందుకే పోయాడు అనడంలేదా?

'ఓ పనయిపోతుంది బాబు' సినిమాలో తమ్ముడు చెయ్యి చూసి, "నువ్వు నూరేళ్ళు బతుకుతావు" అన్న జ్యోతిష్యుడ్ని తమ్ముడు పోయాక బ్రహ్మానందం నల్లకళ్ళద్దాలు పెట్టి శవాన్ని కూర్చోపెట్టి, సిద్ధాంతితో "ఈసారి మళ్ళీ వీడి చెయ్యి చూసి ఆయువు చెప్పండి" అంటే శవం చెయ్యి చూసి "జెర్రిపోతులా వుందండి ఆయుష్ రేఖ" అని సిద్ధాంతి అంటే "గన్ తేరా" అన్నాడు బ్రహ్మానందం అసిస్టెంట్‌ని.

నేను శాస్త్రాన్ని తప్పుపట్టటంలేదు. మనుషుల అవినీతినీ, ఏదైనా అమ్మేసుకునే అమానవత్వాన్నీ తప్పుపడుతున్నాను. జైహింద్.

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4